

సమస్యల్లో సంక్షేమం..!

జిల్లాలోని అన్ని ప్రభుత్వ శాఖల వసతిగృహాల్లో సమస్యలు రాజ్యమేలుతుండగా విద్యార్థులకు ఇబ్బందులు తప్పేలా లేవు.

8లో



ఆకు లక్ష్యం.. ఆమడదూరంలో

ఆదివాసీ, గిరిజనులు వేసవి పంటగా భావించే తునికాకు సేకరణ లక్ష్యం ఈ ఏడాది కూడా నెరవేరలేదు.

10లో

గరిష్టం / కనిష్టం
42° / 28°

వాతావరణం

జిల్లాలో సోమవారం కూడా గరిష్టస్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. ఉదయం నుంచే ఎండ మొదలై తీవ్రమవుతుంది.

రామయ్య దర్శనం.. ఆపై ఖమ్మం

- ఈనెల 15న కేంద్ర హోంమంత్రి అమిత్‌షా పర్యటన
- ఎన్టీఆర్ విగ్రహానికి నివాళి.. ఆ తర్వాత సభలో ప్రసంగం
- షెడ్యూల్ విడుదల చేసిన పార్టీ నాయకత్వం



సాక్షిప్రతినిధి, ఖమ్మం: కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా ఖమ్మం పర్యటన ఖరారైంది. మంత్రి ఈనెల 15న ఖమ్మంలో జరిగే బహిరంగ సభకు హాజరవుతారని ఇప్పటికే ప్రకటించిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు తాజాగా ఏర్పాట్లను పరిశీలించారు. ఈమేరకు ఆదివారం మంత్రి పర్యటన షెడ్యూల్‌ను పార్టీ వర్గాలు వెల్లడించాయి.

ఢిల్లీ నుంచి భద్రాద్రి వయా హైదరాబాద్

కేంద్ర హోం మంత్రి అమిత్‌షా 15వ తేదీన గురువారం ఢిల్లీ నుంచి ప్రత్యేక విమానంలో హైదరాబాద్ వస్తారు. శంషాబాద్‌లో జరిగే కార్యక్రమాల్లో పాల్గొన్నాక హెలీకాప్టర్‌లో మధ్యాహ్నం 2.10గంటలకు భద్రాచలం చేరుకుంటారు. అక్కడ శ్రీసీతారామ చంద్రస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేయనున్నారు. అనంతరం హెలీకాప్టర్‌లోనే సాయంత్రం నాలుగు గంటలకు ఖమ్మం చేరుకుని ఎన్టీఆర్ సర్కిల్‌లోని దివంగత సీఎం ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తారు. అనంతరం ఎస్‌ఆర్‌అండ్‌బీజీఎన్‌ఆర్ మైదానంలో జరిగే బీజేపీ సభలో అమిత్‌షా ప్రసంగిస్తారు. ఆతర్వాత సాయంత్రం ఆరు గంటలకు ఇక్కడి నుంచి హైదరాబాద్ బయలుదేరతారు.

అమిత్‌షా సభాస్థలి పరిశీలన



మైదానాన్ని పరిశీలిస్తున్న బీజేపీ నేతలు, పోలీసు అధికారులు

ఖమ్మం మామిళ్లగూడెం: ఖమ్మం ఎస్‌ఆర్ అండ్ బీజీఎన్‌ఆర్ గ్రౌండ్స్‌లో ఈనెల 15న బీజేపీ ఆధ్వర్యాన నిర్వహిస్తున్న బహిరంగ సభకు కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా హాజరు కానున్నారు. ఈ సందర్భంగా సభాస్థలిని పోలీసు అధికారులతో కలిసి బీజేపీ నాయకులు ఆదివారం పరిశీలించారు. కేంద్ర హోం మంత్రి అమిత్‌షా హాజరయ్యే భారీ బహిరంగ సభకు ఇబ్బందులు ఎదురుకాకుండా సహకరించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ, కిసాన్‌మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి పోలీసు అధికారులను కోరారు. పార్కింగ్, రూట్ మళ్లింపు విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ట్రెయినీ ఐపీఎస్ అవినాశ్‌కుమార్, ఏసీపీలు ప్రసన్నకుమార్, రామోజీ రమేష్, సీఐ శ్రీధర్‌గౌడ్, నాయకులు నున్నా రవికుమార్, నకిరికంటి వీరభద్రం, నూకల రామ్మోహనరెడ్డి, నల్లగట్టు ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.



కొత్తగూడెం ప్రకాశం స్టేడియంలో సీపీఐ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజాగర్జన సభకు హాజరైన పార్టీ కార్యకర్తలు



ఇదీ మా బలం.. బలగం!

- లక్ష మంది వస్తారన్నాం.. వచ్చారు
- కమ్యూనిస్టుల పని అయిపోయిందన్న వారు ఇప్పుడు సమాధానం చెప్పాలి
- గడల రాజకీయం చేయాలంటే ఉద్యోగం వదిలేయాలి
- పొంగులేటిది డబ్బు ఉందనే అహంభావమే
- ప్రజాగర్జన సభలో సీపీఐ జాతీయ నేత నారాయణ, రాష్ట్ర కార్యదర్శి కూనంనేని



సభలో అభివాదం చేస్తున్న సీపీఐ నాయకులు నారాయణ, కూనంనేని, చాడ వెంకటరెడ్డి తదితరులు

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం/సింగరేణి(కొత్తగూడెం): సర్కారు కొలువులో ఉన్నోళ్లు రాజకీయాలు చేస్తున్నారు. అవ్వా కావాలి, బువ్వా కావాలి అంటే ఎలా అని రాష్ట్ర హెల్త్ డైరెక్టర్ గడల శ్రీనివాస్‌రావును ఉద్దేశించి సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ పరోక్షంగా విమర్శించారు. రాజకీయాల్లోకే రావాలని ఉంటే ఉద్యోగానికి రాజీనామా చేయాలని సూచించారు. ఇక కేవలం డబ్బుందనే అహంభావంతో పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఉన్నారని, ప్రజా క్షేత్రంలో ఆయన చేసిన పోరాటాలు ఏమిటని నారాయణ ప్రశ్నించారు. కొత్తగూడెంలో సీపీఐ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి జరిగిన ప్రజాగర్జన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. తమది రాజకీయ పార్టీ అని, ప్రజా క్షేత్రంలో తమకు బలం ఉన్న స్థానాల్లో కచ్చితంగా బరిలో ఉంటామని అన్నారు. పొత్తుల్లోనూ ఈ స్థానాలను తమ హక్కుగా కోరుతామని ఆయన స్పష్టం చేశారు. కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతనం రూ.25వేలు చెల్లించాలంటూ న్యాయస్థానం ఇచ్చిన తీర్పు సింగరేణిలో కూడా అమలు కావడం లేదని మండిపడ్డారు.

కొత్తగూడెం వచ్చి చూడండి..

కమ్యూనిస్టుల పని అయిపోయిందని విమర్శలు చేస్తున్న వారు కొత్తగూడెంలో జరుగుతున్న ప్రజాగర్జన సభను చూసి, తమ బలమెంతో తెలుసుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అన్నారు. ప్రజలంతా స్వచ్ఛందంగా చందాలు వేసుకుని వాహనాల్లో, మరికొందరు నడుచుకుంటూ వచ్చారని తెలిపారు. లక్ష మందితో కొత్తగూడెంలో సభ నిర్వహిస్తామని చెప్పి, చేసి చూపించామని అన్నారు. ఒక్క రూపాయి ఇవ్వకపోయినా సభకు వచ్చిన కార్యకర్తలు, అభిమానులకు శిరస్సు వంచి నమస్కరిస్తున్నానని అన్నారు. కమ్యూనిస్టుల పని అయిపోందని విమర్శలు చేసేవారు తరచుగా తమ నామజపమే చేస్తుంటారని ఎద్దేవా చేశారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో తెలంగాణవాదాన్ని బలంగా తీసుకెళ్లింది సీపీఐ మాత్రమేనని తెలిపారు. ప్రస్తుత సీఎం కేసీఆర్‌ను అరెస్ట్ చేసి ఖమ్మం తరలించినప్పుడు ఆయనకు అండగా నిలిచామన్నారు. బీజేపీ హఠావో.. దేశ్‌కో బచావో నినాదంతో తాము చేపట్టిన ప్రజాపోరు యాత్ర ద్వారా తమ భావజాలాన్ని కోటి మంది ప్రజలకు చేరవేశామని వివరించారు.

కదం తొక్కిన ఎర్రదండు..

ప్రజాగర్జన బహిరంగ సభ నేపథ్యంలో కొత్తగూడేనికి రాష్ట్ర నలుమూలల నుంచి ఎర్రదండు కదం తొక్కింది. ఎర్ర చొక్కా, ఎర్ర చీర, చేతిలో ఎర్రజెండాతో సీపీఐ కార్యకర్తలు, మద్దతుదారులు ప్రైవేట్ వాహనాల్లో, బస్సుల్లో, ర్యాలీగా సభా ప్రాంగణానికి చేరుకున్నారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన వారు సాయంత్రం నాలుగు గంటల సమయానికే వేదిక వద్దకు వచ్చారు. సాయంత్రం ఆరు గంటల సమయానికి కూడా సభా ప్రాంగణం పూర్తిగా నిండలేదు. ఓ వైపు ఎండలు దంచి కొడుతుండటం, మరోవైపు ముందుగా ప్రకటించినట్టు 4వ తేదీన కాకుండా 11వ తేదీకి సభ మారడంతో ఆశించిన స్థాయిలో జన సమీకరణ జరగలేదనే భావన ఏర్పడింది. దీనికి తోడు సీపీఐకి పట్టున్న సింగరేణిలో కార్మికుల సంఖ్య లక్షకు పైస్థాయి నుంచి ఇప్పుడు 40 వేలకు పడిపోవడం కూడా సభపై ప్రభావం చూపుతుందనే అభిప్రాయం కలిగింది. అయితే రాత్రి 7 గంటల సమయానికి ప్రకాశం స్టేడియం లోపలా, బయట జనాలతో నిండిపోయింది. దీంతో తాము ముందుగా చెప్పినట్టు లక్ష మందితో సభను సక్సెస్ చేశామని కూనంనేని హర్షం వ్యక్తం చేశారు. ఎన్నికలు సమీపిస్తున్న వేళ ఈ సభ విజయవంతం కావడం సీపీఐ శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపింది. సభావేదికపై ప్రజా నాట్యమండలి కళాకారుల ఆటపాటలు సభికులను ఆకట్టుకున్నాయి.

ఈ సభలో సీపీఐ జాతీయ నాయకులు మహేష్ కుంజ, చాడ వెంకట్‌రెడ్డి, బాగం హేమంతరావు, నాయకులు వాసిరెడ్డి సీతారామయ్య పశ్య పద్మ, తక్కెళ్లపల్లి శ్రీనివాసరావు, ఇట్టి నర్సింహం, కలివెల శంకర్, బాల మల్లేష్, బాల నర్సింహ, పోటు ప్రసాద్, ఎస్.కే.సాబీర్‌పాషా, అయోధ్య, రావులపల్లి రాంప్రసాద్, మహ్మద్ మౌలానా, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

సకల సౌకర్యాలు.. నూతన హంగులు



పునఃప్రారంభానికి ముస్తాబైన ఖమ్మంలోని రాజేంద్రనగర్ హైస్కూల్

నేడు తెరుచుకోనున్న పాఠశాలలు

- తొలిరోజే పుస్తకాలతో పాటు యూనిఫాం, మధ్యాహ్న భోజనం పంపిణీ
- 'మన ఊరు–మన బడి'తో మెరుగైన వసతులు
- కొన్నిచోట్ల మాత్రం వసతుల లేమి, ఉపాధ్యాయుల కొరత



ప్రభుత్వ పాఠశాలలోని డ్యూయెల్ డెస్క్ బెంచీలు



రఘునాథపాలెం మండలం పంగిడిలో పాఠశాలను శుభ్రం చేస్తున్న సిబ్బంది

ఖమ్మం సహకారనగర్: విద్యావ్యవస్థను బలోపేతం చేయడంలో భాగంగా ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు సత్ఫలితాలనిస్తున్నాయి. గతేడాది నుంచి పాఠశాలలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించగా, మెరుగైన వసతులు సమకూరడమేకాక నాణ్యమైన బోధన అందించేందుకు కసరత్తు జరుగుతోంది. ప్రధానంగా మన ఊరు – మన బడి పథకంలో భాగంగా చేపట్టిన పనులతో పలు పాఠశాలలు అన్ని హంగులు అద్దుకున్నాయి. ఈమేరకు సోమవారం నూతన విద్యాసంవత్సరం మొదలుకానుండగా విద్యార్థులకు స్వాగతం పలికేందుకు ఉపాధ్యాయులు సిద్ధమవుతున్నారు. కాగా, గతానికి భిన్నంగా ఈసారి తొలిరోజే విద్యార్థులకు యూనిఫాం, పాఠ్య పుస్తకాలు అందించడమే కాక మార్చిన మెనూ ప్రకారం బలవర్ధకమైన మధ్యాహ్న భోజనం కూడా వడ్డించనున్నారు.

98వేలకు పైగా విద్యార్థులు

జిల్లాలో అన్ని యాజమాన్యాల్లో కలిపి 1,213 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. వీటిలో సుమారు 98వేల మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. గతేడాది నుంచి మన ఊరు మన బడి, మన బస్తీ – మన బడి ద్వారా పాఠశాలల్లో మెరుగైన వసతులు కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించింది. జిల్లాలో తొలివిడతగా 426 పాఠశాలలను ఎంపిక చేయగా, 163 పాఠశాలల్లో పనులు పూర్తయ్యాయి. ఇందులో 18 పాఠశాలలను ఇప్పటికే ప్రారంభించారు. మిగతా పాఠశాలలను తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఈనెల 20వ తేదీన ప్రారంభించే అవకాశం ఉంది.

భోజనం మరింత పౌష్టికం

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు మధ్యాహ్నం మరింత పౌష్టికాహారం అందజేయాలని నిర్ణయించారు. ఇందుకోసం ఇప్పటికే కొనసాగుతున్న పథకంలో మార్పులు చేశారు. ఇందులో భాగంగా సోమవారం కిచిడీ, మిక్స్‌డ్ వెజిటబుల్ కర్రీ, మంగళవారం అన్నం, సాంబారు, మిక్స్‌డ్ వెజిటబుల్ కర్రీ, బుధవారం అన్నం, ఆకుకూర, మిక్స్‌డ్ వెజిటబుల్ కర్రీ, గురువారం వెజిటబుల్ బిర్యానీ, మిక్స్‌డ్ వెజిటబుల్ కర్రీ, శుక్రవారం అన్నం, సాంబార్, మిక్స్‌డ్ వెజిటబుల్ కర్రీ, శనివారం అన్నం, ఆకుకూరలు, మిక్స్‌డ్ వెజిటబుల్ కర్రీతో పాటు వారానికి మూడు రోజులు ఉడకబెట్టిన కోడిగుడ్లు అందజేస్తారు.

అక్కడక్కడా టీచర్ల కొరత

పాఠశాలల్లో కనీస సౌకర్యాల కల్పన, పాఠ్య పుస్తకాలు, యూనిఫాం పంపిణీ వరకు బాగానే ఉన్నా ఉపాధ్యాయుల నియామకంపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వడం లేదు. ఏళ్లుగా ఉపాధ్యాయులకు పదోన్నతులు, బదిలీలు లేకపోవడంతో అనేక పాఠశాలల్లో కీలక సబ్జెక్టులు బోధించే వారు లేరు. వర్క్ అడ్జస్ట్‌మెంట్ పేరుతో గతేడాది నుంచి కాలం వెళ్లదీస్తుండగా... ఈ ఏడాది కనీసం విద్యావలంటీర్లనైనా నియమించాలనే డిమాండ్ వస్తోంది.

మరికొన్ని సమస్యలు కూడా..

పాఠశాలల ఆవరణ, గదుల్లో స్థానిక సంస్థల సిబ్బందితో పారిశుద్ధ్య పనులు చేయించాలని ఉన్నతాధికారులు సూచిస్తున్నారు. కానీ క్షేత్రస్థాయిలో అమలు కావడం లేదని ఉపాధ్యాయులు చెబుతున్నారు. కార్మికులకు కుదిరిన సమయాల్లో పాఠశాలల్లో శుభ్రం చేసేందుకు వస్తుండగా సమస్య ఎదురవుతోందని సమాచారం. ఈమేరకు మన ఊరు – మన బడిలో భాగంగా వసతులు సమకూరినందున నైట్ వాచ్‌మెన్లతో పాటు స్కావెంజర్లను నియమించాలని ఉపాధ్యాయులు కోరుతున్నారు.

80శాతం హాజరు నమోదుకు కృషి



నేటి నుంచి పాఠశాలలు తెరుచుకోనున్నాయి. తొలిరోజే విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫాం అందించడంతో పాటు మధ్యాహ్న భోజనం అమలుచేస్తాం. మొదటిరోజు నుంచే 80శాతానికి హాజరు నమోదు చేయించాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. ఉపాధ్యాయులు బడిబాట కార్యక్రమాలు నిర్వహిస్తూనే పాఠాలు బోధిస్తారు.

– ఈ.సోమశేఖర శర్మ, జిల్లా విద్యాశాఖాధికారి

ముందస్తుగానే పుస్తకాలు, యూనిఫాం

గతంలో పాఠశాలలు ప్రారంభమై సగం రోజులు గడిచాక కూడా పుస్తకాలు అందకపోయేవి. కానీ ఈసారి పునః ప్రారంభం రోజునే విద్యార్థులకు పాఠ్య పుస్తకాలే కాక యూనిఫాంలు అందించాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా జిల్లా విద్యార్థులకు అవసరమైన 5,76,740పుస్తకాల్లో 5,32,340 పుస్తకాలు చేరాయి. మిగతావి ఒకట్రెండు రోజుల్లో జిల్లాకు రానుండగా... చేరిన వాటినైతే పంపిణీకి సిద్ధం చేశారు. అలాగే, యూనిఫాం కూడా దాదాపుగా పాఠశాలలకు చేరింది.



రోటరీనగర్ పాఠశాలలో పాఠ్య పుస్తకాలు

పాఠ్యాంశేతర పుస్తకాలనూ చదవాలి..

- పుస్తక మహోత్సవంలో కలెక్టర్ గౌతమ్
- కవిసమ్మేళనం సందర్భంగా పలువురికి సన్మానం



'భాస్కరాలు' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కలెక్టర్ గౌతమ్, కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ తదితరులు

ఖమ్మంమయూరిసెంటర్: విద్యార్థులు తమ తరగతి పుస్తకాలే కాక పాఠ్యాంశేతర పుస్తకాలనూ చదవాలని కలెక్టర్ వీ.పీ.గౌతమ్ సూచించారు. తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఆదివారం లకారం ట్యాంక్‌బండ్‌పై తెలంగాణ బుక్ ట్రస్ట్ ఆధ్వర్యాన నిర్వహించిన పుస్తక మహోత్సవాన్ని మేయర్ పి.నీరజతో కలిసి కలెక్టర్ ప్రారంభించి మాట్లాడారు. పుస్తక ప్రియులు, విద్యార్థులు, నగర ప్రజలు తమ అభిరుచికి తగిన పుస్తకాలు చదివేందుకు ప్రయత్నించాలని సూచించారు. కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభి మాట్లాడుతూ ఈనెల 18వ తేదీ వరకు ట్యాంక్‌బండ్‌పై పుస్తక ప్రదర్శన ఉంటుందన్నారు.

ఘనంగా కవిసమ్మేళనం


ట్యాంక్‌బండ్‌పై నిర్వహించిన కవి సమ్మేళనంలో 80 మందికి పైగా కవులు పాల్గొని తెలంగాణ అభివృద్ధిపై వచన, పద్య కవితలు వినిపించారు. వీరిని కలెక్టర్ సన్మానించి నగదు బహుమతులు అందజేశారు. జిల్లాలో ఉత్తమ కవులు ఐదుగురిని ఎంపిక చేసి రాష్ట్ర స్థాయి పోటీలకు పంపనున్నట్లు తెలిపారు. తొలుత కలెక్టర్ గౌతమ్, మేయర్ నీరజ, కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభి తదితరులు దాశరథి కృష్ణమాచార్య, దాశరథి రంగాచార్యుల విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ బుక్ ట్రస్ట్ కార్యదర్శి చంద్రమోహన్, డీఈఓ సోమశేఖరశర్మ, నిర్వాహకులు వి.దామోదర్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

నేడు 'తెలంగాణ రన్'

ఖమ్మంక్రైం: తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సోమవారం తెలంగాణ రన్ నిర్వహిస్తున్నట్లు సీపీ విష్ణు ఎస్.వారియర్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని సర్దార్ పటేల్ స్టేడియం వద్ద ఉదయం 6గంటలకు ప్రారంభయ్యే రన్ లకారం ట్యాంక్‌బండ్ వరకు కొనసాగుతుందని పేర్కొన్నారు. జిల్లా వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని ఆయన సూచించారు.

నేటి నుంచి ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు



ఖమ్మం సహకారనగర్: ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు సోమవారం నుంచి ఈనెల 19వ తేదీ వరకు నిర్వహించనున్నారు. ఉదయం పరీక్ష 9నుంచి 12గంటల వరకు, మధ్యాహ్నం పరీక్ష 2–30నుంచి 5–30గంటల వరకు జరుగుతుంది. జిల్లాలో 38కేంద్రాలు ఏర్పాటు చేయగా 14,027మంది విద్యార్థులు హాజరు కానున్నారు. ఇందులో ప్రథమ సంవత్సరం విద్యార్థులు 10,082మంది, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 3,945మంది విద్యార్థులు ఉన్నారని డీఐఈఓ రవిబాబు తెలిపారు.

నేటి గ్రీవెన్స్ డే రద్దు

ఖమ్మం సహకారనగర్: రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో అధికార యంత్రాంగం నిమగ్నమైన నేపథ్యాన సోమవారం కలెక్టరేట్‌లో జరగాల్సిన ప్రజావాణి(గీవెన్స్ డే)ని రద్దు చేసినట్లు కలెక్టర్ గౌతమ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విషయాన్ని జిల్లా ప్రజలు గమనించి సహకరించాలని సూచించారు.

ప్రశాంతంగా గ్రూప్–1 పరీక్ష

- 17,365మందిలో 10,945మంది హాజరు
- కేంద్రాలను తనిఖీ చేసిన కలెక్టర్ గౌతమ్



పరీక్ష కేంద్రంలో పరిశీలిస్తున్న కలెక్టర్ గౌతమ్

ఖమ్మం సహకారనగర్: టీఎస్‌పీఎస్సీ ఆధ్వర్యాన ఆదివారం నిర్వహించిన గ్రూప్–1 ప్రిలిమినరీ పరీక్ష జిల్లాలో ప్రశాంతంగా ముగిసింది. ఉదయం 10–30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్ష జరగగా, అభ్యర్థులను 8–30గంటల నుంచే అనుమతించారు. పరీక్ష కేంద్రాల వద్ద అవాంఛనీయ ఘటనలు జరగకుండా పటిష్టమైన బందోబస్తు ఏర్పాటుచేశారు. కాగా, జిల్లాలోని 50పరీక్ష కేంద్రాల్లో 17,365మంది అభ్యర్థులకు గాను 10,945మంది(63.03శాతం) హాజరయ్యారు. ఇక 6,420మంది గైర్హాజరయ్యారని అధికారులు వెల్లడించారు. ఉదయం 10–15గంటల వరకే అనుమతిస్తామని చెప్పినా, కొందరు అభ్యర్థులు ఉరుకులు, పరుగులపై రావడం కనిపించింది. కాగా, సూర్యాపేట జిల్లా కోదాడకు చెందిన మానస ఎస్‌ఆర్ అండ్ బీజీఎన్‌ఆర్ కళాశాల కేంద్రానికి బదులు సమీపంలోని పీజీ కళాశాలకు వెళ్లింది. తప్పుగా వచ్చానని తెలుసుకుని మళ్లీ ఎస్‌ఆర్ అండ్ బీజీఎన్‌ఆర్ కేంద్రానికి వచ్చేసరికి పది నిమిషాలు ఆలస్యం కావడంతో అనుమతించలేదు. ఇక కలెక్టర్ వీ.పీ.గౌతమ్, అదనపు కలెక్టర్ స్నేహలత వేర్వేరుగా పలు పరీక్ష కేంద్రాలను సందర్శించి నిర్వహణ, బందోబస్తుపై సూచనలు చేశారు. అసిస్టెంట్ కలెక్టర్ మయాంక్ సింగ్, ఆర్డీఓలు రవీంద్రనాథ్, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



ఎస్‌ఆర్‌అండ్‌బీజీఎన్ కేంద్రం వద్ద క్యూలో అభ్యర్థులు

భారీ బందోబస్తు

ఖమ్మం క్రైం: గత అనుభవాల దృష్ట్యా గ్రూప్–1 పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయడంతో పాటు భారీ బందోబస్తు ఏర్పాటుచేశారు. పలు కేంద్రాల వద్ద ఏర్పాట్లను సీపీ విష్ణు ఎస్.వారియర్ తనిఖీ చేయగా, ట్రెయినీ ఐపీఎస్ అవినాష్‌కుమార్, ఏసీపీ రామోజీ రమేష్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఉత్సాహంగా బ్యాడ్మింటన్ టోర్నీ

ఖమ్మం స్పోర్ట్స్: ఖమ్మం ఇండోర్ స్టేడియంలో ఉమ్మడి జిల్లాస్థాయి సీనియర్స్ బ్యాడ్మింటన్ టోర్నీ నిర్వహించారు. బ్యాడ్మింటన్ సంఘం బాధ్యులు సిరిపురపు సుదర్శన్, తమ్మినేని వెంకట్రావు, ఎస్.ఉప్పల్‌రెడ్డి ప్రారంభించారు. అలాగే, ముగింపు సమావేశంలో విజేతలకు బహుమతులు అందజేశారు. సీనియర్ పురుషుల సింగిల్స్‌లో ఎస్.వినయ్, కె.ప్రశాంత్, డబుల్స్ విభాగంలో మహేష్–శ్రీకాంత్, మనోజ్–ఎం.వినయ్, 35ప్లస్ వయసు కేటగిరీ సింగిల్స్‌లో ఎం.నరేష్, ఎ.పవన్, డబుల్స్‌లో ఎ.పవన్, మగీన్, 40 ప్లస్‌లో శ్రీనునాయక్, హుస్సేన్, డబుల్స్‌లో శ్రీనివాస్‌నాయక్–దాస్, అనిల్–అప్పారావు, 45 ప్లస్ కేటగిరీ సింగిల్స్‌లో వి.నాగేశ్వరరావు, టి.సైదులు, డబుల్స్‌లో ఆర్ఎస్.రెడ్డి–వై.పాపారావు, దిలీప్–చంద్రశేఖర్ ప్రథమ, ద్వితీయస్థానాల్లో నిలిచారు. ఈ కార్యక్రమంలో పి.రవిమారుత్, పాటిబండ్ల యుగేందర్ పాల్గొన్నారు.

రామాలయాలకు 'ఆదిపురుష్' టికెట్లు

ఖమ్మం గాంధీచౌక్: హీరో ప్రభాస్ నటించిన 'ఆదిపురుష్' సినిమా ఈనెల 16న విడుదల కానుంది. కల్లూరు మండలం ఎర్రబోయినపల్లికి చెందిన శ్రేయస్ మీడియా అధినేత గంద్ర శ్రీనివాస్ జిల్లావ్యాప్తంగా ప్రతీ రామాలయానికి వంద చొప్పున టికెట్లు ఉచితంగా అందించాలని నిర్ణయించారు. వివరాలకు 84660 12345 నంబర్‌లో సంప్రదించాలని ఓ ప్రకటనలో సూచించారు.

ఆర్థికసాయం

రఘునాథపాలెం: మండలంలోని మంచుకొండకు చెందిన బీఆర్ఎస్ కార్యకర్త తగరం బాలస్వామి ఆదివారం మృతి చెందాడు. రైతుబంధు సమితి జిల్లా సభ్యుడు మందడపు సుధాకర్, ఆత్మ కమిటీ చైర్మన్ భూక్యా లక్ష్మణ్ ఆయన మృతదేహం వద్ద నివాళులర్పించి పువ్వాడ ఫౌండేషన్ ద్వారా ఆర్థికసాయం అందజేశారు. నాయకులు రవికిరణ్, సంజీవరావు, క్రాంతి, లాజరస్, శంకర్, విజయ్, గోపాల్ పాల్గొన్నారు.

గేదెను తప్పించబోయి మృతి

కారేపల్లి: గేదెను తప్పించబోయిన ద్విచక్ర వాహనదారుడు అదుపుతప్పి స్తంభాన్ని ఢీకొట్టడంతో మృతి చెందాడు. మండలంలోని చింతలతండాకు చెందిన మేస్త్రీ వాంకుడోతు శోభన్ (35) ఆదివారం ద్విచక్రవాహనంపై ఖమ్మం నుంచి గ్రామానికి వస్తున్నాడు. ఖమ్మం–ఇల్లెందు ప్రధాన రహదారిపై ఊట్కూరు స్టేజీ వద్ద అడ్డుగా వచ్చిన గేదెను తప్పించే క్రమంలో అదుపుతప్పి కరెంట్ స్తంభాన్ని ఢీకొట్టాడు. ఘటనలో తీవ్రంగా గాయపడిన ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య మౌనిక, ఇద్దరు పిల్లలు ఉండగా కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రామారావు తెలిపారు.

వరిగడ్డి వాములు దగ్ధం

ఖమ్మంరూరల్: మండలంలోని తనగంపాడుకు చెందిన నాగేశ్వరరావు, రామారావు, ఉమాశంకర్‌కు చెందిన గడ్డి వాములకు ప్రమాదవశాత్తు నిప్పంటుకోవడంతో కాలిపోయాయి. ఆదివారం మధ్యాహ్నం గడ్డివాముల నుంచి మంటలు ఎగిసిపడుతుండగా.. రైతులు ఆర్పేందుకు ప్రయత్నించినా ఫలితం దక్కలేదు.

టీ.ఎల్.పేటలో..

ఏన్కూరు: మండలంలోని తూతకలింగన్నపేట పొలాల్లో ప్రమాదవశాత్తు మంటలు రేగి వరిగడ్డి కాలిపోయింది. ఇదే సమయాన గాలి వీస్తుండడంతో సమీప పొలాల్లోకి మంటలు వ్యాపించగా స్థానికులు అప్రమత్తమై ఆర్పివేశారు.

చెరువు కాపలాదారుడు మృతి

చింతకాని: మండలంలోని రామకృష్ణాపురానికి చెందిన చెరువు కాపలాదారుడు బోయ బాబు (41) ఆదివారం మృతి చెందాడు. కందికుంట చెరువు వద్ద బోయ బాబు, పోతురాజు హన్మంతరావు ప్రతీరాత్రి కాపలా ఉంటారు. శనివారం రాత్రి కూడా వెళ్లిన వారు వేర్వేరు చోట్ల పడుకున్నారు. ఆదివారం ఉదయం బాబు వద్దకు హన్మంతరావు వెళ్లి పిలిచినా పలకపోవడంతో కుటుంబీకులకు చేరుకుని పరిశీలించారు. బాబు గుండెపోటుతో మృతి చెంది ఉంటాడనే అనుమానంతో కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

వివాహిత ఆత్మహత్య

నేలకొండపల్లి: కడుపు నొప్పి తాళలేక ఓ వివాహిత ఆత్మహత్యకు పాల్పడింది. మండలంలోని రాజారాంపేట క్వారీలో పనిచేస్తున్న తమిళనాడు వాసి గణేష్ మండల కేంద్రంలో అద్దెకు ఉంటున్నాడు. ఆయన భార్య శుభశ్రీ(22) కడుపునొప్పి భరించలేక ఆదివారం ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని స్వస్థలానికి తీసుకెళ్లారు.

సమస్యల్లో సంక్షేమం..!

- హాస్టళ్లలో విద్యార్థులను వేధిస్తున్న అసౌకర్యాలు
- అరకొర నిధులతో పరిష్కారం కాని సమస్యలు
- ఎస్సీ వసతి గృహాల్లో అరకొరగా పనులు
- బీసీ సంక్షేమ శాఖలో నివేదికలతోనే సరి

ఖమ్మంమయూరిసెంటర్: వేసవి సెలవుల సందర్భంగా మూతబడిన ప్రభుత్వ సంక్షేమ శాఖల వసతిగృహాలు విద్యాసంవత్సరం పునఃప్రారంభం రోజైన సోమవారం తెరుచుకోనున్నాయి. దాదాపు రెండు నెలల తర్వాత వసతిగృహాలకు రానున్న విద్యార్థులకు మళ్లీ పాత సమస్యలే స్వాగతం పలకనున్నాయి. జిల్లాలోని ఎస్సీ, బీసీ, గిరిజన అభివృద్ధి శాఖల నిర్వహిస్తున్న హాస్టళ్ల పరిస్థితి అధ్వానంగా ఉండగా, విద్యార్థులకు కనీస మౌలిక వసతులు కూడా కరువయ్యాయి. తాగునీరు, మరుగుదొడ్లు, బాత్‌రూమ్‌లు సరిగ్గా లేవు. వేసవి సెలవుల్లో మరమ్మతులపై దృష్టి సారించాల్సిన అధికారులు పట్టించుకోకపోవడంతో విద్యార్థులు మళ్లీ అరకొర వసతులే నడుమే కాలం గడపాల్సిన పరిస్థితులు దాపురించాయి.



వల్లభి ఎస్సీ హాస్టల్‌లో విరిగిపోయిన బాత్‌రూమ్ తలుపులు

పట్టింపు కరువాయె..

ప్రభుత్వం పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య, వసతి కల్పించేందుకు వసతిగృహాలను నిర్వహిస్తోంది. కానీ వీటిని అధికారులు పట్టించుకోకపోవడంతో సంక్షేమ భవనాలు శిథిలావస్థకు చేరుతున్నాయి. ఎస్సీ సంక్షేమశాఖలోని కొన్ని హాస్టళ్లలో ఇటీవల క్రూషియల్ ఫండ్‌తో మరమ్మతు చేయించినా, బీసీ, గిరిజన శాఖలో కనీసం పనులు చేపట్టలేదు. మన ఊరు–మన బడి పథకం కింద ప్రభుత్వ పాఠశాలలన్నీ కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా కొత్తరూపు సంతరించుకోగా.. హాస్టళ్లు మాత్రం కళావిహీనంగా ఉన్నాయి. డైట్ బిల్లులు, ఇతర బిల్లులు పెండింగ్‌లో ఉండడంతో ఈ ఏడాది నిర్వహణ పట్ల అధికారులు తలపట్టుకుంటున్నారు.



శిథిలావస్థకు చేరిన సత్తుపల్లి బీసీ బాలుర వసతి గృహం

నివేదికలు తయారు చేశాం..

మరమ్మతులు అవసరమైన వసతిగృహాలపై నివేదిక ఇవ్వాలని కలెక్టర్ ఆదేశించారు. అన్ని వసతిగృహాలను ఆధునీకరించి, రంగులు వేయించాలని సూచించారు. దీంతో వసతిగృహాల్లో నెలకొన్న సమస్యలను గుర్తించి నివేదిక తయారు చేశాం. త్వరలోనే మరమ్మతులు చేయిస్తాం.

– జి.జ్యోతి, డీడీ, బీసీ అభివృద్ధి శాఖ

కొన్నింటిలో పనులు పూర్తయ్యాయి..

ఎస్సీ వసతిగృహాల్లో వసతులను మెరుగుపరిచేందుకు రెండు, మూడేళ్లుగా క్రూయల్ వెల్ఫేర్ ఫండ్ ద్వారా పనులు చేపడుతున్నాం. కొన్ని వసతిగృహాల్లో ఇప్పటికే పనులు పూర్తయ్యాయి. మరికొన్ని వసతిగృహాల్లో త్వరలోనే పనులు చేపట్టి విద్యార్థులు ఇబ్బంది పడకుండా చూస్తాం.

– కస్తాల సత్యనారాయణ, డీడీ, ఎస్సీ అభివృద్ధి శాఖ

హాస్టల్ ఏదైనా సమస్యలు అవే..

- జిల్లావ్యాప్తంగా ఏ శాఖ హాస్టల్‌ను చూసినా సమస్యలు మాత్రం ఒకేరకంగా ఉన్నాయి. ఎస్సీ అభివృద్ధి శాఖ ఆధ్వర్యాన 41 ప్రీ మెట్రిక్ వసతి గృహాలు ఉండగా.. అనేక భవనాల్లో వాటర్ ట్యాప్‌లు, బాత్‌రూమ్ టైల్స్ పగిలి, తలుపులు ఊడిపోయాయి. గతేడాది మరమ్మతులు చేపట్టగా బిల్లులు రావడం లేదని కాంట్రాక్టర్ మధ్యలోనే వదిలేసివెళ్లాడు. ఇక కొన్ని వసతిగృహాల్లో పనులే ప్రారంభించలేదు. ఎన్నో ఏళ్ల క్రితం నిర్మించిన భవనాలు కావడంతో వర్షాకాలంలో కురిసే ప్రమాదం ఉంది. ఇక ఫైర్ సెఫ్టీకి సంబంధించి పరికరాలు పెట్టినా అలంకారప్రాయంగానే మారాయి.
- బీసీ అభివృద్ధి శాఖ ఆధ్వర్యాన 22 ప్రీ మెట్రిక్ వసతి గృహాలు ఉండగా.. చాలాచోట్ల అరకొర సౌకర్యాలతో నడుస్తున్నాయి. కిటికీలు లేకపోవడం, తాగునీటి సమస్యలు వేధిస్తున్నాయి. పలు భవనాలు శిథిలావస్థకు చేరాయి. గతేడాది కొంతమేర నిధులతో చిన్నచిన్న మరమ్మతులే చేశారు. అధికారుల నివేదికలు కాగితాలకే పరిమితమవుతున్నాయి.
- గిరిజన అభివృద్ధి శాఖ ఆధ్వర్యాన పది ఆశ్రమ పాఠశాలలు, ఎనిమిది ప్రీ మెట్రిక్ వసతిగృహాలు ఉన్నాయి. వీటిల్లో తాగునీరు, మరుగుదొడ్లు ప్రధాన సమస్యలు. భవనాలకు అవసరమైన మరమ్మతులను గుర్తించడంలో అధికారులు విఫలమయ్యారు. నగరంలోని ఎన్నెస్పీ క్యాంప్ కళాశాల బాలుర వసతిగృహంలో బాత్‌రూంలు లేకపోవడంతో విద్యార్థులు ఆరుబయటే స్నానం చేస్తున్నారు.

ఇంకా కొన్ని...

- సత్తుపల్లిలోని బీసీ బాలుర హాస్టల్ అసౌకర్యాల నడుమ సాగుతోంది. ఇక్కడ 3 నుంచి 10వ తరగతి వరకు వసతి సదుపాయం ఉండగా, చెదలు పట్టిన కిటికీలు, పగిలిపోయిన తలుపులు దర్శనమివ్వడంతో పాటు భవనం శిథిలావస్థకు చేరింది. తాగునీటి సౌకర్యం లేదు. భవన మరమ్మతులకు ప్రతిపాదనలు సిద్ధంగా ఉన్నా ఏడాదిగా చేపట్టలేదు. అలాగే, వల్లభిలో ఎస్సీ బాలుర వసతిగృహం జిల్లా కేంద్రానికి దూరంగా ఉండడం, సంక్షేమాధికారి ఖమ్మంలో ఉండడంతో దృష్టి సారించడం లేదని తెలుస్తోంది. వసతిగృహంలో బాత్‌రూమ్‌లు, మరుగుదొడ్లు మరమ్మతుకు రాగా, సీసీ కెమెరా వేలాడుతోంది. ఫైర్ సేఫ్టీ సిలిండర్ల పరిస్థితి అంతంతేనని చెప్పాలి.

కొనుక్కో లేమండి..!

కొండెక్కిన కోడి మాంసం ధర

- కిలో చికెన్ రూ.350.. అంతకు పైగానే..
- ఇదే రికార్డు ధర అని చెబుతున్న వ్యాపారులు..

ఖమ్మంవ్యవసాయం: కోడి మాంసం ధర కొండెక్కింది. పరిశ్రమల్లో కోళ్ల ఉత్పత్తి తగ్గి వినియోగం పెరగడంతో చికెన్‌కు డిమాండ్ ఏర్పడింది. ఇటీవల కేజీ చికెన్ ధర రూ.250 వరకు పలకగా.. ఆదివారం రూ.350, కొన్ని ప్రాంతాల్లో అంతకు మించి ధర నమోదైంది. డిమాండ్‌కు తగిన విధంగా కోళ్ల ఉత్పత్తి లేదని.. పిల్లలు, దాణా ధరలు పెరగడం ఇందుకు కారణమని వ్యాపారులు చెబుతున్నారు.

అధిక ఉష్ణోగ్రతలతో తగ్గిన ఉత్పత్తి..

కోళ్ల ఉత్పత్తిపై అధిక ఉష్ణోగ్రతల ప్రభావం ఉంది. సాధారణంగా వేసవిలో పరిశ్రమల నిర్వాహకులు కోళ్ల పెంపకం తగ్గిస్తారు. పిల్లలు ఎండ తట్టుకోలేక చనిపోతాయని, ఆశించిన స్థాయిలో బరువు పెరగవని చెబుతారు. అయితే, ఈసారి మార్చి నుంచే ఎండ తీవ్రత ఉండడం, మే, జూన్‌లలో నిప్పుల కుంపటిలా మారడంతో కోళ్ల పరిశ్రమ మరింత కుదేలైంది. ఇక రూ.1,600 వరకు ఉన్న దాణా ధర ప్రస్తుతం రూ.2,500కు, రూ.20 ఉన్న కోడి పిల్ల ధర రూ.40కి చేరడమే కాక నిర్వహణ ఖర్చులు పెరగడంతో పౌల్ట్రీ ఫాంల నిర్వాహకులు వేసవిలో కోళ్ల పెంపకంపై పెద్దగా ఆసక్తి చూపడం లేదు. పౌల్ట్రీ ఫాంలో కిలో కోడి పెంపకానికి ప్రాంతం ఆధారంగా రూ.140 నుంచి రూ.150 వరకు ఖర్చవుతుండగా, వ్యాపారులకు రూ.180 చొప్పున విక్రయిస్తున్నారు. ఆతర్వాత రవాణా, ఇతర ఖర్చులు.. తరుగు చూసుకుంటూ కిలో చికెన్(స్కిన్ లెస్) ధర రూ.350, ఆ పైనే విక్రయిస్తున్నారు. స్కిన్‌తోనైతే రూ.320, బోన్‌లెస్ రూ.620కి అమ్ముతుండగా.. నాటుకోడి ధర కిలోకు రూ.500పైనే పలుకుతోంది.

వినియోగం పెరగడంతో డిమాండ్..

రకరకాల కారణాలతో కోళ్ల ఉత్పత్తి తగ్గటంతో చికెన్ ధర పెరిగింది. మటన్ ధరలు అందనంత ఎత్తులో ఉండడంతో చాలా మంది చికెన్‌కు ప్రాధాన్యత ఇస్తుండగా ఈ ధర కూడా పెరగడం గమనార్హం. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఆదివారం 90 టన్నుల చికెన్ వినియోగిస్తారనే అంచనా కాగా.. ఇప్పుడు పెళ్లిళ్ల సీజన్ కావడంతో వినియోగం పెరిగి కొరత ఏర్పడింది. కాగా, మార్చిలో కిలో చికెన్ ధర రూ.170 ఉండగా, ఏప్రిల్‌లో రూ.200, మేలో రూ.250 నుంచి రూ.280 వరకు పలికి ఇప్పుడు రూ.350కి చేరగా ఇదే రికార్డు ధరగా చెబుతున్నారు. ఇక్కడ కోళ్ల లభ్యత లేకపోవడంతో ఇతర ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకుంటున్నారు.



ఓ షాపులో చికెన్ సిద్ధం చేస్తున్న నిర్వాహకులు



ఖమ్మం అగ్రహారం రోడ్డులో కోడి పిల్లలు లేక వెలవెలబోతున్న పౌల్ట్రీ ఫాం

భారంగా చికెన్ ధర..



చికెన్ ధర గతంతో పోలిస్తే రెట్టింపు అయింది. కిలో ధర రూ.350 కావడంతో వాడకాన్ని తగ్గించాం. గతంలో రూ.180 నుంచి రూ.200 వరకు వెచ్చిస్తే కిలో చికెన్ వచ్చేది. కానీ రూ.200కు ముప్పావు కేజీ కూడా రావడం లేదు. మటన్ ధర అందుబాటులో లేదని చికెన్ వైపు వస్తే ఇక్కడ అదే పరిస్థితి ఉంది.

– దేశబోయిన తిరుపతయ్య, శ్రీనివాస్‌నగర్, ఖమ్మం

ఉత్పత్తి తగ్గడంతోనే..



వినియోగానికి తగినట్లుగా కోళ్ల ఉత్పత్తి లేకపోవడంతో ధరలపై ప్రభావం పడుతోంది. వివిధ కారణాలతో పరిశ్రమల యాజమాన్యాలు కోళ్ల ధరలు పెంచారు. దీంతో చికెన్ ధరలు పెరిగాయి. దీనికి తోడు శుభకార్యాల సమయం కావడంతో డిమాండ్ పెరిగి ప్రస్తుతం రికార్డ్ స్థాయిలో ధర పలుకుతోంది.

– పోరా సత్యనారాయణ, చికెన్ సెంటర్ల అసోసియేషన్ అధ్యక్షుడు

పెంపకాలు తగ్గించాం..



కరోనా కాలం నుంచి కోళ్ల పరిశ్రమలు దెబ్బతిని నష్టాలు ఎదురవుతుండడంతో పెంపకాన్ని తగ్గించాం. దీంతో కోళ్ల ఉత్పత్తి తగ్గి.. చికెన్ ధరలు పెరిగాయి. అలాగే, ఉష్ణోగ్రతలతో కోళ్ల పెంపకం ఇబ్బందికరంగా మారింది. ఇతర ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది.

– రావి బాబూరావు, పౌల్ట్రీ పరిశ్రమ యజమాని, ఖమ్మం

ప్రైవేట్ బస్సులు.. ఫిట్'లెస్'

- నేటి నుంచి పాఠశాలల ప్రారంభం
- 568 బస్సుల్లో 300 బస్సులకే ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు

ఖమ్మంక్రైం: వేసవి సెలవుల అనంతరం సోమవారం నుంచి పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయి. అయితే ఇప్పటివరకు జిల్లాలోని ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు ఇంకా తమ బస్సులకు సంబంధించి ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు తీసుకోలేదు. ఈ సర్టిఫికెట్ లేకుండా రహదారిపైకి బస్సు తీసుకొస్తే సీజ్ చేసే అధికారం రవాణా శాఖ అధికారులకు ఉంటుంది. అలాగే, ప్రమాదాలు జరిగే అవకాశముందని తెలిసినా.. యాజమాన్యాలు పట్టించుకోకపోవడం పలు విమర్శలకు తావిస్తోంది.

నిబంధనలు బేఖాతరు..

జిల్లాలో 568 స్కూల్ బస్సులు ఉండగా.. శనివారం వరకు ఖమ్మం, సత్తుపల్లి, వైరా రవాణాశాఖ పరిధిలో 300 బస్సులకే ఫిట్‌నెస్ సర్టిఫికెట్ తీసుకున్నారు. పాఠశాలల బస్సులకు నెల ముందుగానే ఫిట్‌నెస్ సర్టిఫికెట్ తీసుకోవాలని సూచిస్తున్నా.. అది లేకుండానే తిప్పాలని భావిస్తున్నట్లు సమాచారం. సెలవుల కారణంగా నెలన్నర నుంచి పక్కన పెట్టిన బస్సుల్లో ఒకేసారి విద్యార్థులను తీసుకెళ్లడం ద్వారా వారి జీవితాలతో చెలగాటమాడినట్లేననే తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

డ్రైవింగ్ వచ్చినా, రాకున్నా..

జిల్లాలో కొన్ని ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు డ్రైవింగ్ సరిగ్గా రాని వారితోనే బస్సులు నడిపిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. విద్యార్థులను జాగ్రత్తగా తీసుకెళ్లాల్సి ఉన్నా అతివేగంగా బస్సులు నడుపుతూ, సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేస్తున్నారని తల్లిదండ్రులు వాపోతున్నారు. దీనికి తోడు యాజమాన్యాలు ఫిట్‌నెస్ సర్టిఫికెట్ తీసుకోవడంపై శ్రద్ధ చూపకపోవడం గమనార్హం.



బస్సులో అగ్ని నిరోధక పరికరాన్ని పరిశీలిస్తున్న ఎంవీఐ వరప్రసాద్

నేటి నుంచి స్పెషల్ డ్రైవ్..

పాఠశాలలు తెరుచుకోనున్న దృష్ట్యా సోమవారం నుంచి స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తాం. బస్సులకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్ తీసుకోవాలని యాజమాన్యాలకు సూచించాం. కానీ ఎండల కారణంగా మరమ్మతులు చేయడం లేదని చెబుతున్నారు. ఏదిఏమైనా ఫిట్‌నెస్ సర్టిఫికెట్ లేకుండా రోడ్డుపై తిరిగే పాఠశాలల బస్సులను సీజ్ చేయడమే కాక జరిమానా విధిస్తాం.

– తోట కిషన్‌రావు, జిల్లా రవాణా శాఖాధికారి

బడిబాట.. సక్సెస్ మీట్!

సత్తుపల్లి ఎంపీపీఎస్, యూపీఎస్‌ల్లో 114 మంది చేరిక



సమావేశంలో మాట్లాడుతున్న ప్రసాద్

సత్తుపల్లిరూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచడమే లక్ష్యంగా చేపట్టిన బడిబాటతో సత్తుపల్లిలోని ఎంపీపీఎస్, యూపీఎస్‌ల్లో గణనీయమైన సంఖ్యలో విద్యార్థులు చేరారు. ఈ సందర్భంగా రెండు పాఠశాలల్లో కలిపి 114మంది విద్యార్థులు కొత్తగా చేరిన నేపథ్యాన ఆదివారం యూపీఎస్‌లో బడిబాట సక్సెస్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం చిత్తలూరి ప్రసాద్ మాట్లాడుతూ ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు, ఏఎన్ఎంలు, తల్లిదండ్రుల సహకారంతో జిల్లాలో ఎక్కడా లేని విధంగా 114 నూతన అడ్మిషన్లు చేశామన్నారు. అనంతరం పాఠశాల ఆవరణ ప్రాంగణం, తరగతి గదులను శుభ్రం చేయించి మామిడాకులతో అలంకరించారు. ఉపాధ్యాయులు జయశ్రీ, లాల్ అహ్మద్, పవన్, నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

మట్టి తరలిస్తున్న వాహనాలు అడ్డగింత

పెనుబల్లి: మండలంలోని కేఎం.బంజర్ చెరువు నుంచిఆంధ్రా ప్రాంతానికి మట్టిని తరలిస్తున్న వారిని జల వనరుల శాఖ అధికారులు అడ్డుకున్నారు. ఎలాంటి అనుమతి లేకుండా చెరువు నుంచి మూడు జేసీబీలు, పొక్లెయినర్, ట్రాక్టర్ సాయంతో ఆంధ్రా ప్రాంతంలోని ఇటుక బట్టీలకు మట్టి తరలిస్తున్నారు. దీంతో జల వనరుల శాఖ ఏఈ కిరణ్ పోలీసులకు సమాచారం ఇచ్చి అడ్డుకున్నారు. ఈమేరకు ట్రాక్టర్ డ్రైవర్లు వాహనాలతో సహా పారిపోగా మూడు పొక్లెయినర్లను పోలీసులు స్వాధీనం చేసుకుని వీఎం.బంజర్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు.



పోలీసులు అదుపులోకి తీసుకున్న పొక్లెయినర్

వైరాలో దొంగలు హల్‌చల్

రెండు షాపుల్లో రూ.1.50 లక్షలకు పైగా సొత్తు చోరీ

వైరా: వైరాలో శనివారం తెల్లవారుజామున దొంగలు రెండు చోట్ల దొంగతనాలకు పాల్పడ్డారు. శ్రీనివాస థియేటర్ పక్కన ఉన్న సాయిరాం బేకరీతో పాటు ఆ పక్కనే ఉన్న వెంకటేశ్వర హోటల్‌లో షట్టర్లు పైకి లేపి చోరీ చేశారు. బేకరీలో క్యాష్ కౌంటర్‌లో దాచిన మూడు తులాల బంగారు గొలుసు, రూ.5వేల నగదు, సిగరెట్ బాక్సులు ఎత్తుకెళ్లారని నిర్వాహకుడు భద్రయ్య తెలిపారు. ఆపక్కనే ఉన్న వెంకటేశ్వర హోటల్‌లో కౌంటర్ పగలగొట్టి నగదు ఎత్తుకెళ్లారు. రెండు షాపుల్లో రూ.1.50లక్షలకు పైగా సొత్తు చోరీ అయిందని బాధితులు వెల్లడించారు. గతంలో మూడుసార్లు దొంగతనం జరగగా, మళ్లీ ఇప్పుడు చోరీ జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈమేరకు సమాచారం అందుకున్న పోలీసులు సీసీ టీవీ పుటేజీల ఆధారంగా దర్యాప్తు మొదలుపెట్టారు.

సాఫీగా సాగిన గ్రూప్-1

జిల్లాలో గ్రూప్–1 పరీక్ష సాఫీగా సాగడంతో అధికార యంత్రాంగం ఊపిరి పీల్చుకుంది. కలెక్టర్ గౌతమ్, సీపీ వారియర్‌తో పాటు అదనపు కలెక్టర్ స్నేహలత పలు కేంద్రాలను తనిఖీ చేశారు. కేంద్రాలకు అభ్యర్థులు నిర్ణీత సమయానికి ముందుగానే చేరుకోగా, క్షుణ్ణంగా తనిఖీ చేశాకే అనుమతించారు. కొన్నికేంద్రాల వద్ద సామగ్రి భద్రపరిచేందుకు క్లాక్ రూంలు ఏర్పాటుచేశారు. అభ్యర్థులతో వచ్చిన బంధువులు ఎండలో ఇబ్బంది పడుతూ పడిగాపులు కాశారు. – ఖమ్మం సహకారనగర్/ఖమ్మంక్రైం



అభ్యర్థులను తనిఖీ చేస్తున్న సిబ్బంది



పరీక్ష కేంద్రం వద్ద పోలీసులకు సూచనలు చేస్తున్న సీపీ వారియర్



కాలి పట్టీతో వస్తున్న అభ్యర్థి



దివ్యాంగురాలిని తీసుకొస్తున్న వారికి సహకరిస్తున్న పోలీసులు

క్లుప్తంగా...


కష్టమర్లకు వస్త్రాలు అందిస్తోన్న వెంకటేష్

రామ్‌రాజ్ షోరూంను ప్రారంభించిన హీరో వెంకటేష్

మొగల్రాజపురం (విజయవాడ తూర్పు): రామ్‌రాజ్ కాటన్ సంస్థ సంప్రదాయ వస్త్రాలు తయారు చేస్తూ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుతోందని సినీ హీరో దగ్గుబాటి వెంకటేష్ అన్నారు. ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా విజయవాడ పిన్నమనేని పాలిక్లినిక్ రోడ్డులో ఏర్పాటు చేసిన రామ్‌రాజ్ కాటన్ 250వ షోరూంను ఆదివారం ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ కాటన్ దుస్తులు ధరిస్తే శరీరానికి హాయిగా ఉండటమే కాకుండా పర్యావరణాన్ని పరిరక్షించినట్లు అవుతోందన్నారు. నెల్లూరులో 100వ షోరూంను కూడా తానే ప్రారంభించానన్నారు. రామ్‌రాజ్ కాటన్ సంస్థ చైర్మన్ కేఆర్ నాగరాజన్ మాట్లాడుతూ.. ధోతీలు, షర్ట్‌లు, ఇన్నర్‌వేర్‌లు, నైట్ వేర్, ఫ్యాబ్రిక్స్, కిడ్స్ అండ్ ఉమెన్స్ వేర్‌లతో పాటుగా అన్ని రకాల శుభకార్యాలకు అవసరమైన వస్త్రాలు తమ షోరూంలో అందుబాటులో ఉంటాయన్నారు.

విద్యుత్ తీగ తెగి నిలిచిన రైళ్లు

బెల్లంపల్లి: విద్యుత్ ఇంజన్‌కు ప్రమాదశాత్తూ ఓవర్ హెడ్ ఎలక్ట్రిక్ తీగ చుట్టుకుని తెగిపోవడంతో మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి – మందమర్రి రైల్వే స్టేషన్ల మధ్య 3 గంటలపాటు రైళ్లు నిలిచిపోయాయి. ఆదివారం మధ్యాహ్నం జరిగిన ఈ ఘటనతో ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. రైల్వే అధికారులు తెలిపిన సమాచారం ప్రకారం.. గోరఖ్‌పూర్ – మహబూబ్‌నగర్ (నెంబర్ 05303) సమ్మర్ స్పెషల్ ట్రైన్ బెల్లంపల్లి రైల్వే స్టేషన్‌కు మధ్యాహ్నం 2:48 గంటలకు చేరుకుంది. మంచిర్యాల వైపు వెళ్తుండగా.. బెల్లంపల్లి – మందమర్రి రైల్వేస్టేషన్ల మధ్య 2:55 గంటలకు రైలు ఇంజిన్‌కు ఓహెచ్‌ఈ తీగ చుట్టుకుని తెగిపోయింది. దీంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగి రైళ్ల రాకపోకలు నిలిచిపోయాయి. రైల్వే ఉన్నతాధికారులు రంగంలోకి దిగి 3 గంటలు శ్రమించి ఓహెచ్‌ఈ వైరును పునరుద్ధరించారు. సాయంత్రం 5:50 గంటలకు మరమ్మతులు పూర్తిచేసి రైళ్ల రాకపోకలను పునరుద్ధరించారు.

నిలిచిపోయిన రైళ్లు ...
కోర్బా–కొచ్చివెల్లి సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్, హజ్రత్ నిజాముద్దీన్–బెంగళూరు రాజధాని ఎక్స్‌ప్రెస్, సిర్పూర్‌టీ)–భద్రాచలం రోడ్ సింగరేణి ప్యాసింజర్ రైళ్లతోపాటు గోరఖ్‌పూర్–మహబూబ్‌నగర్ సమ్మర్ స్పెషల్ నిలిచిపోయాయి.

ఏపీలో 20 ఎంపీ సీట్లు గెలవాలి

- విశాఖ సభలో కేంద్ర హోం మంత్రి అమిత్‌షా



సాక్షి, విశాఖపట్నం: వచ్చే ఎన్నికల్లో ఆంధ్రప్రదేశ్‌లో 20 ఎంపీ స్థానాలు గెలవాలని కేంద్ర హోం మంత్రి అమిత్‌షా అన్నారు. రాష్ట్రానికి కేంద్రం సహకరిస్తున్నందునే అభివృద్ధి సాధ్యమైందనే విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లి.. వారి ఆశీర్వాదం కోరాలని బీజేపీ శ్రేణులకు పిలుపునిచ్చారు. రాష్ట్రంలో నాలుగేళ్లుగా అవినీతి ప్రభుత్వం నడుస్తోందని మండిపడ్డారు. ప్రధాని మోదీ తొమ్మిదేళ్ల పాలన పూర్తయిన సందర్భంగా బీజేపీ ఆదివారం సాయంత్రం విశాఖలో మహాజన సంపర్క్ అభియాన్ సభ నిర్వహించింది. విశాఖ రైల్వే గ్రౌండ్స్‌లో జరిగిన ఈ సభకు అమిత్‌షా ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనపై విమర్శలు, ఆరోపణలు గుప్పించారు. ఈ నాలుగేళ్లలో జగన్ ప్రభుత్వం అవినీతి ఆరోపణలను, కుంభకోణాలను ఎదుర్కొంటోందన్నారు. రైతుల ఆత్మహత్యల్లో ఆంధ్రప్రదేశ్ మూడో స్థానంలో ఉందన్నారు. ప్రధాని మోదీ ఇచ్చే సొమ్ముతో సీఎం జగన్ రైతు భరోసా పేరిట రైతులను మభ్య పెడుతున్నారని ఆరోపించారు. పేదలకు కేంద్రం ఇచ్చే బియ్యం పథకంపై జగన్ ఫొటో వేసుకుంటున్నారన్నారు. విశాఖ.. సమాజ విరోధ శక్తులకు అడ్డాగా మారిందని, భూ మాఫియా పెరిగిందని విమర్శించారు.

తొమ్మిదేళ్లలో రూ.10 లక్షల కోట్లు
ఆంధ్రప్రదేశ్‌కు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఎంతో సహకారం అందిస్తోందని కేంద్ర మంత్రి అమిత్‌షా అన్నారు. ఏపీకి భారీగా నిధులు కేటాయించడంతో పాటు ఐఐటీ, ఐఐఎం, ఎన్ఐటీ, ఎయిమ్స్, మెడికల్ కాలేజీలు, ట్రిపుల్ ఐటీ, సెంట్రల్, ట్రైబల్ యూనివర్సిటీలు వంటి పలు కేంద్ర సంస్థలను మంజూరు చేసిందని చెప్పారు. 2009 – 2014 వరకు యూపీఏ ప్రభుత్వం ఏపీకి పన్నులు, గ్రాంట్ల రూపంలో రూ.78 వేల కోట్లు ఇస్తే మోదీ పాలన తొమ్మిదేళ్లలో రూ.10 లక్షల కోట్లు ఇచ్చారని తెలిపారు. 2014 నాటికి రాష్ట్రంలో నాలుగు వేల కిలోమీటర్ల జాతీయ రహదారులు ఉండగా, ఇప్పుడవి 9 వేల కిలోమీటర్లకు విస్తరించాయన్నారు. భోగాపురం ఎయిర్‌పోర్టుతో పాటు విశాఖ–సికింద్రాబాద్, తిరుపతి–సికింద్రాబాద్‌ల మధ్య వందేభారత్ రైళ్లు, కాకినాడలో బల్క్ డ్రగ్ పార్క్ వంటివి ప్రధాని మోదీ మంజూరు చేశారని చెప్పారు. విశాఖపట్నం, కాకినాడ, తిరుపతి, అమరావతిలను స్మార్ట్ సిటీలుగా అభివృద్ధి చేస్తున్నామన్నారు.

కుంభకోణాలకు తావులేని పాలన
దేశంలో 2004 నుంచి 2014 వరకు సోనియాగాంధీ నేతృత్వంలోని మన్మోహన్‌సింగ్ ప్రభుత్వం రూ.12 లక్షల కోట్ల అవినీతికి, ఎన్నో కుంభకోణాలకు పాల్పడిందని, అందుకు బాధ్యులపై చర్యలూ తీసుకోలేదని అమిత్ షా ఆరోపించారు. నరేంద్రమోదీ తొమ్మిదేళ్ల పాలనలో ఒక్క అవినీతి కుంభకోణం జరగలేదన్నారు. పైగా ప్రపంచ దేశాల్లో భారత్ గౌరవాన్ని మోదీ పెంచారన్నారు. మోదీ ప్రధాని అయ్యాక దేశంలో ప్రతి ఇంటికి విద్యుత్, మరుగుదొడ్డి సదుపాయం కల్పించారన్నారు. రానున్న ఎన్నికల్లో బీజేపీ 300 లోక్‌సభ స్థానాలు దక్కించుకుంటుందని జోస్యం చెప్పారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు, ఆ పార్టీ నేతలు సత్యకుమార్, పురందేశ్వరి, విష్ణుకుమార్‌రాజు తదితరులు రాష్ట్ర ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. ఈ సభలో కేంద్ర మంత్రి మురళీధరన్, మాజీ సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి, పార్టీ నేతలు సునీల్ ధియోదర్, జీవీఎల్ నరసింహారావు, టీజీ వెంకటేష్, సీఎం రమేష్, సుజనాచౌదరి, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీయే మా ప్రథమ శత్రువు


కొత్తగూడెం సభలో మాట్లాడుతున్న కూనంనేని సాంబశివరావు, వేదికపై నారాయణ తదితరులు

▶ మొదటి పేజీ తరువాయి

అమ్ముడుపోయారని, పోరాటాలు మరిచిపోయారని విమర్శించడం బండి సంజయ్‌కు తగదన్నారు. తన పదవి ఉంటుందా, ఊడుతుందా అనే దానిపై సంజయ్ దృష్టి సారిస్తే మంచిదని అన్నారు. రోజుకో పార్టీ మారేవాళ్లు, అధికారం కోసం పశువుల్లా వ్యవహరించే వాళ్లు, ఏసీ రూముల్లో కూర్చునే వాళ్లు.. తమకు నీతులు చెబుతారా అంటూ నిప్పులు చెరిగారు. కమ్యూనిస్టుల ఊపిరిలోనే పోరాటం ఉందని ఆయన పేర్కొన్నారు.

ప్రజల గోడు కేసీఆర్ వినాలి
తెలంగాణ ఏర్పాటుకు మొదటగా మద్దతు పలికిన జాతీయ పార్టీ సీపీఐ అని కేసీఆర్ ఎన్నో సార్లు చెప్పారని, కానీ ఈ రోజు దశాబ్ది ఉత్సవాల్లో తమ ఊసే లేకుండా పోయిందని కూనంనేని అన్నారు. ఓ తండ్రిలా రాష్ట్ర ప్రజల కష్టసుఖాలను వినాల్సిన బాధ్యత సీఎం కేసీఆర్‌పై ఉందని, బాధలు చెప్పుకునే అవకాశం ప్రజలకు ఇవ్వాలని సూచించారు. అంతర్గత కుమ్ములాటను చక్కదిద్దుకుంటే తప్ప బీజేపీకి వ్యతిరేకంగా కాంగ్రెస్ నిలబడలేదని పేర్కొన్న ఆయన.. ప్రస్తుతం కేసీఆర్ రాష్ట్రంలో బీజేపీకి వ్యతిరేకంగా బలంగా నిలబడ్డారని చెప్పారు.

ఫ్రంట్‌లో చేరకపోతే సందేహాలొస్తాయి..
బీజేపీకి వ్యతిరేకంగా జాతీయ స్థాయిలో ఏర్పడుతున్న ఫ్రంట్‌లోకి రావాలని ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ కోరారు. లేదంటే బీజేపీకి వ్యతిరేకంగా కేసీఆర్ చేస్తున్న పోరాటంపై సందేహాలకు ఆస్కారం ఉంటుందని అన్నారు. ఇటీవల బీజేపీపై విమర్శల వాడిని కేసీఆర్ తగ్గించారని, కానీ ఒక్కసారి బీజేపీకి లొంగిపోతే మరింతగా బీఆర్ఎస్‌పై బీజేపీ దాడి చేస్తుందని చెప్పారు. ఈ విషయాన్ని పరిగణనలోకి తీసుకుని బీజేపీకి వ్యతిరేకంగా మరింత గట్టిగా పోరాటం చేయాలని కేసీఆర్‌కు సూచించారు.

మేము ఏమైనా సన్యాసులమా..?
ప్రజాగర్జన సభను కొందరు ఎన్నికల బహిరంగ సభ అంటున్నారని, మేము ఎన్నికల బహిరంగ సభ పెడితే తప్పేమిటని నారాయణ ప్రశ్నించారు. 'మేము రాజకీయ పార్టీ నడిపిస్తున్నాం. అసెంబ్లీ, పార్లమెంట్‌లో మా సభ్యులు ఉండాలని కోరుకుంటున్నాం. అలాంటప్పుడు మేము ఎన్నికల బహిరంగ సభ పెడితే తప్పేంటి. మేము ఏమైనా సన్యాసులమా? రాజకీయ ఆకాంక్షలు లేకుండా ఉండటానికి..' అని ప్రశ్నించారు.

పొత్తుల చర్చ వస్తే చంద్రబాబు ల్యాప్‌టాప్ ఓపెన్ చేస్తారు..
'ఎన్నికల పొత్తులో భాగంగా సీట్ల కేటాయింపుల అంశం చర్చకు వస్తే చంద్రబాబు లాప్‌టాప్ ఓపెన్ చేస్తారు. ఏ సీటులో ఏ పార్టీకి ఎన్ని ఓట్లు వచ్చాయో అంటూ లెక్కలు వివరించడం మొదలెడతారు. గతంలో ఓసారి నాకు కూడా ఇలాగే ల్యాప్‌టాప్ పాఠాలు చెప్పేందుకు ప్రయత్నించాడు. నేను వెంటనే హే! ఆపవయ్యా బాబు.. నీకు పూర్తి బలం ఉంటే మాతో ఎందుకు పొత్తు పెట్టుకుంటున్నావ్? అని అడిగా..' అని నారాయణ చెప్పారు.

మోదీకి 30 మంది దత్తపుత్రులు
నాకు కుటుంబం లేదని, కుటుంబాలు ఉన్న కేసీఆర్ వంటి నేతలు అవినీతికి పాల్పడుతుంటారని మోదీ తరచుగా విమర్శలు చేస్తుంటారు కానీ, మోదీకి 30 మంది దత్త పుత్రులు ఉన్నారని, వీరంతా కార్పొరేట్ శక్తులుగా బ్యాంకులను దోచుకుంటున్నారని నారాయణ ఆరోపించారు. మోదీ గడ్డం పెరుగుతున్నట్టుగా దేశంలో గ్యాస్, పెట్రోల్, డీజిల్, నిత్యావసర వస్తువుల ధరలు పెరుగుతున్నాయని విమర్శించారు. కేంద్ర హోం మంత్రి అమిత్‌షాపైనా ఆరోపణలు చేశారు. కేంద్ర కేబినెట్‌లో 24 మంది క్రిమినల్స్ ఉన్నారని పేర్కొన్నారు.

తొమ్మిదేళ్లుగా కాలయాపనే..!

వలస కార్మికుల సంక్షేమంపై నీలినీడలు

- తెలంగాణ ఏర్పాటుకు ముందు గల్ఫ్‌వలస కార్మికులకు వరాల జల్లు
- ప్రత్యేక రాష్ట్రం ఏర్పడినా ప్రవాసులకు అందని ఫలాలు
- దశాబ్ది వేడుకల సందర్భంగానైనా సర్కారు స్పందించాలని డిమాండ్



మోర్తాడ్(బాల్కొండ): వలస కార్మికుల సంక్షేమంపై తెలంగాణ ప్రభుత్వం నేటికీ నాన్చుడు ధోరణి అవలంబిస్తుండటంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఎన్నో కష్టనష్టాలకు ఓర్చి గల్ఫ్ బాట పట్టిన కార్మికుల గురించి ప్రభుత్వం కనీసంగా ఆలోచన చేయకపోవడంపై సర్వత్రా నిరసనలు వ్యక్తమవుతున్నాయి. తెలంగాణ ఏర్పాటుకు ముందు ప్రవాస కార్మికులకు వరాల జల్లు కురిపించిన నాయకులు గద్దెనెక్కిన తర్వాత వారి సంక్షేమం విస్మరించడం విస్మయానికి గురిచేస్తోంది. తొమ్మిదేళ్లుగా పట్టించుకోని నేతలు దశాబ్ది వేడుకల సందర్భంగానైనా ప్రవాసీ విధానం, గల్ఫ్ బోర్డు అమలుపై దృష్టి సారించాలనే డిమాండ్ వినిపిస్తోంది.

- తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో వలస కార్మికుల అంశంపై ప్రత్యేక చర్చ జరిగింది. ప్రత్యేక రాష్ట్రం సిద్ధించిన తర్వాత గల్ఫ్ వలసలు తగ్గుతాయని అందరు భావించారు. కానీ ఇందుకు భిన్నంగా వలసలు మరింత ఎక్కువ కావడం గమనార్హం.

ప్రవాసీ విధానంపై అధ్యయనం చేసినా..
గల్ఫ్ దేశాలకు మన రాష్ట్రం నుంచి వలసలు పెరుగుతుండడంతో ప్రవాసీ విధానం అమలు చేసి వలస కార్మికుల కోసం ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత 2020 జనవరిలో అప్పటి ప్రభుత్వ సలహాదారు రాజీవ్‌శర్మ, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్‌కుమార్, సీఎం ముఖ్య కార్యదర్శి నర్సింగరావుల బృందం కేరళ వెళ్లి అక్కడ వారం రోజుల పాటు ప్రవాసీ విధానంపై అధ్యయనం చేసింది. సీఎం ముఖ్య కార్యదర్శి నర్సింగరావు నేతృత్వంలో పాపారావు అనే మరో అధికారి ప్రవాసీ విధానంపై ముసాయిదాను సైతం తయారు చేశారు. కానీ ఇప్పటి వరకు ప్రవాసీ విధానం గానీ, గల్ఫ్ బోర్డు అంశంపై ఎలాంటి స్పందన లేదు.

బడ్జెట్ సమావేశాల్లో ప్రత్యేకంగా ప్రస్తావన
రాష్ట్ర బడ్జెట్ సమావేశాల్లో వలస కార్మికుల సంక్షేమం, వారు విదేశాల నుంచి మన రాష్ట్రాభివృద్ధికి సహకరిస్తున్న తీరుపై ప్రత్యేకంగా ప్రస్తావించారు. మంత్రి హరీశ్‌రావు 2022 నాటి బడ్జెట్ ప్రసంగంలో వలస కార్మికుల రుణం తీర్చుకోవడానికి ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తామని హామీ ఇచ్చారు. ఒకే ఒక్కసారి 2018లో ఎన్ఆర్ఐ సెల్‌కు రూ.100 కోట్లు కేటాయించినా మార్గదర్శకాలను జారీ చేయకపోవడంతో నిధులను ఖర్చు చేయలేదు.

తొమ్మిదేళ్లలో 1,800ల మంది మృతి
ఉపాధి కోసం గల్ఫ్‌కు వెళ్లిన వలస కార్మికుల్లో కొంత మంది వివిధ కారణాలతో గత తొమ్మిదేళ్లలో 1,800ల మంది మృతి చెందారు. గల్ఫ్ దేశాల నుంచి శంషాబాద్ విమానాశ్రయానికి చేరుకున్న శవపేటికలే ఇందుకు సాక్ష్యమని వలస కార్మికుల సంఘాల నేతలు పేర్కొంటున్నారు. మృతి చెందిన కార్మికుల కుటుంబానికి రూ. 5లక్షల చొప్పున సాయం అందిస్తే రూ. 90 కోట్లు అవసరం అవుతుంది. రాష్ట్రాభివృద్ధికి ఏటా లక్ష కోట్లకుపైగా బడ్జెట్‌లో కేటాయింపులు చేస్తున్న ప్రభుత్వం మృతి చెందిన వలస కార్మికుల కోసం రూ.90కోట్లను ఎందుకు కేటాయించడం లేదన్న వాదనలు వెల్లువెత్తుతున్నాయి.

పట్టించుకోకపోతే ఇబ్బందులే..

వలస కార్మికుల సంక్షేమంపై దృష్టి సారించకపోతే అధికార పక్షానికి ఇబ్బందులు తప్పవు. కరోనా వేళ ఎంతో మంది సొంతూళ్లకు చేరుకున్నారు. ఇక్కడ సరైన ఉపాధి లేక మళ్లీ గల్ఫ్ బాట పట్టారు. వలస కార్మికులతో ప్రభుత్వాలకు ఆదాయం లభిస్తున్నా వారి సంక్షేమం గురించి ఆలోచన చేయకపోవడం విచారకరం.

– మంద భీంరెడ్డి, గల్ఫ్ వ్యవహారాల విశ్లేషకులు

ఎన్ఆర్ఐ పాలసీ అమలు చేయాలి

రాష్ట్రంలో ఎన్ఆర్ఐ పాలసీని అమలు చేయకపోతే ఉద్యమం తప్పదు. ఏళ్ల తరబడి వలస కార్మికులు ఎన్నో ఇబ్బందులకు ఓర్చుకుంటూ గల్ఫ్ బాటనే ఎంచుకున్నారు. ఇతర దేశాలకు వెళ్తున్న వారిలో అందరు పేద, మధ్య తరగతి కుటుంబాల వారే ఉన్నారు. ప్రవాసీ విధానంతో వలస కార్మికుల బతుకుల్లో మార్పు వస్తుందనే నమ్మకం ఉంది.

– కృష్ణ దొనికెని, వ్యవస్థాపకులు గల్ఫ్ కార్మికుల అవగాహన వేదిక

జిల్లా వార్తలు

నేడు షాపింగ్ కాంప్లెక్స్ ప్రారంభం


నిర్మాణం పూర్తయిన షాపింగ్ కాంప్లెక్స్

పాల్వంచరూరల్: పాల్వంచ మండలం శ్రీకనక దుర్గ(పెద్దమ్మతల్లి) ఆలయం ఎదుట నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్‌ను సోమవారం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు ప్రారంభిస్తారని ఈఓ ఎస్.రజనీకుమారి, ఆలయ కమిటీ చైర్మన్ మహిపతి రామలింగం తెలిపారు. ఆదివారం వారు విలేకరులతో మాట్లాడుతూ రూ.1.2కోట్లతో కాంప్లెక్స్ నిర్మించామని తెలిపారు. ధర్మకర్తలు చింత నాగరాజు, ఆచార్యులు, వెంకటరామారావు, కె.నాగమల్లేశ్వరరావు, శ్రీనివాసరెడ్డి, జి.వెంగళరావు, పాపయ్యదొర పాల్గొన్నారు.

'దశాబ్ది' ప్రగతిపై రవాణా శాఖలో ప్రచారం


ఖమ్మం ఆర్‌టీఓ కార్యాలయంలోని టీవీ

ఖమ్మంక్రైం: తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా తొమ్మిదేళ్లలో సాధించిన ప్రగతిని రవాణా శాఖ ఆధ్వర్యాన విస్తృత ప్రచారం చేస్తున్నారు. ఈమేరకు ఖమ్మంలోని జిల్లా రవాణా శాఖ కార్యాలయంలో టీవీ ఏర్పాటుచేసిన తెలంగాణ ఏర్పడ్డాక రవాణా శాఖలో తీసుకొచ్చిన సంస్కరణలు, ఆన్‌లైన్ సేవలను వివరిస్తున్నారు. అలాగే, జాతీయ స్థాయి ప్రమాణాలతో సిరిసిల్లలో నిర్మించిన డ్రైవింగ్ ట్రాక్ దృశ్యాలను ప్రసారం చేస్తున్నారు.

నేడు సేంద్రియ వ్యవసాయంపై అవగాహన

మధిర: గోఆధారిత సేంద్రియ వ్యవసాయంపై మహబూబాబాద్ జిల్లాలో సోమవారం అవగాహన సదస్సు జరగనుందని ప్రకృతి వ్యవసాయ రైతు కుడుముల వెంకట్రామిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఆది గురుభారత్ సంఘం, అరబిందో ఫార్మా ఆధ్వర్యాన మహబూబాబాద్ జిల్లా తాళ్లపూసపల్లిలోని రైతు జయపాల్‌రెడ్డి మామిడి తోటలో ఈ సదస్సు నిర్వహించబడుతుందని పేర్కొన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాతో పాటు మహబూబాబాద్, నల్లగొండ, వరంగల్ జిల్లాల రైతులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

ఆకు లక్ష్యం.. ఆమడదూరంలో...


అభయారణ్యంలో తునికాకు సేకరిస్తున్న మహిళలు

- నెరవేరని తునికాకు సేకరణ లక్ష్యం
- 35,100 స్టాండర్డ్ బ్యాగుల్లో 21,748 బ్యాగులే పూర్తి
- ప్రభావం చూపిన అకాల వర్షాలు, 'ఉపాధి' పథకం


సేకరించిన తునికాకు కట్టలు కడుతున్న గిరిజనులు

పాల్వంచరూరల్: తునికాకు సేకరణ లక్ష్యం ఈ ఏడాది కూడా ఆమడదూరంలోనే ఆగిపోయింది. గతేడాది 70శాతం లక్ష్యాన్ని సాధించగా, ఈ ఏడాది 64.53శాతమే పూర్తయింది. గత ఏప్రిల్ ఆఖరు నుంచి ఈనెల మొదటి వారం వరకు గిరిజనులు, గిరిజనేతరులు తునికాకు సేకరణ చేశారు. అయితే, సీజన్ మొదట్లో అకాల వర్షాలు కురవడం, ఎక్కువ శాతం మంది ప్రజలు ఉపాధి హామీ పథకం పనులకు వెళ్లడం కారణంగా తునికాకు సేకరణ లక్ష్యం నెరవేరలేదని అటవీ శాఖ అధికారులు చెబుతున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని ఆరు డివిజన్ల పరిధిలో ఈ ఏడాది 35,100 స్టాండర్డ్ బ్యాగుల తునికాకు(యాభై ఆకుల కట్టలు వెయ్యి కలిపితే ఒక స్టాండర్డ్ బ్యాగ్) సేకరించాలనే లక్ష్యంగా నిర్దేశించారు. కానీ 21,748 బ్యాగ్‌ల సేకరణే పూర్తయింది. గతేడాది కూడా 35,100 బ్యాగుల లక్ష్యమే ఉండగా.. 24,520 బ్యాగ్‌ల ఆకు సేకరించారు.

డివిజన్ల వారీగా సేకరణ..
భద్రాద్రి జిల్లాలోని అటవీ డివిజన్ల వారీగా తునికాకు సేకరణ లక్ష్యం, సాధించిన వివరాలిలా ఉన్నాయి. కిన్నెరసాని అభయారణ్యం డివిజన్‌లో 3,200 స్టాండర్డ్ బ్యాగ్‌ల లక్ష్యానికి 2,402.98 స్టాండర్డ్ బ్యాగుల ఆకు సేకరణ పూర్తయింది. ఇక్కడ గత ఏడాది 5వేల బ్యాగ్‌లకు గాను 1,954 బ్యాగ్‌లే సేకరించారు. కొత్తగూడెం డివిజన్ పరిధిలో ఈ ఏడాది 3,900 బ్యాగ్‌లకు 1,444.92 బ్యాగ్‌లు, గత ఏడాది 3,900 బ్యాగ్‌ల్లో 1,513 బ్యాగ్‌ల ఆకు సేకరణ చేపట్టారు. ఇల్లెందు డివిజన్ పరిధిలో ఈఏడాది 10,600 బ్యాగ్‌లకు గాను 6,646.30 బ్యాగ్‌లు, గతేడాది 11,500 బ్యాగ్‌లకు గాను 7,197 బ్యాగ్‌లు, భద్రాచలం డివిజన్ పరిధిలో ఈ ఏడాది 9,700 బ్యాగ్‌లకు 5,051.90 బ్యాగ్‌లు, గతేడాది 9,400 బ్యాగ్‌లకు 7,733 స్టాండర్డ్ బ్యాగుల ఆకు సేకరణ పూర్తయింది. ఇక మణుగూరు డివిజన్‌లో ఈ ఏడాది 5,400 బ్యాగ్‌లకు గాను 4,987.30 బ్యాగ్‌లు, గతేడాది 6,200 బ్యాగ్‌లకు గాను 4,759 బ్యాగ్‌లు, పాల్వంచ డివిజన్‌లో ఈ ఏడాది 2,300 స్టాండర్డ్ బ్యాగ్‌లకు గాను 1,214.60 స్టాండర్డ్ బ్యాగ్‌లు, గతేడాది 1,362 స్టాండర్డ్ బ్యాగుల తునికాకు సేకరించారు.

మొదలవడమే ఆలస్యం
సహజంగా ఏటా ఏప్రిల్ నెలాఖరు నుంచే తునికాకు సేకరణ మొదలవుతుంది. కానీ ఈసారి వారం, పది రోజుల పాటు ఆలస్యంగా ప్రారంభమైంది. నెల పాటు గిరిజన కూలీలు తునికాకు సేకరణలో నిమగ్నమవుతారు. వేకువజాము నుంచే కూలీలు అడవి ప్రాంతానికి వెళ్లి మధ్యాహ్నం వరకు తునికాకు సేకరిస్తారు. ఆతర్వాత ఆకును ఇళ్లకు చేర్చి 50 ఆకుల చొప్పున కట్టలు కట్టి తీసుకెళ్లి కల్లాల్లో అప్పగిస్తారు.

ఈసారి సేకరణ తగ్గింది



జిల్లాలోని అటవీ డివిజన్ల పరిధిలో తునికాకు సేకరణ ఈసారి తగ్గింది. అకాల వర్షాలకు తోడు గిరిజనులు ఉపాధి హామీ పనుల వైపు మొగ్గు చూపడం ప్రధాన కారణంగా కనిపిస్తోంది. దీంతో అనుకున్న లక్ష్యాన్ని చేరలేదు. గతంలో తునికాకు సేకరణకు ఏజెన్సీలోని గ్రామాల ప్రజలు, ప్రధానంగా గిరిజనులు ముందుకొచ్చేవారు. భద్రాద్రి జిల్లాలో నాణ్యమైన తునికాకు లభిస్తున్నా.. సేకరణకు చాలా మంది ఆస్తి చూపడం లేదు.

– లక్ష్మణ్ రంజిత్‌నాయక్, భద్రాద్రి జిల్లా అటవీ శాఖాధికారి

ఏపీలో ఇచ్చారు.. ఇక్కడా ఇవ్వండి..

1998 డీఎస్సీ క్వాలిఫైడ్ అభ్యర్థుల వేడుకోలు

సత్తుపల్లి: 1998 డీఎస్సీ క్వాలిఫైడ్ అభ్యర్థులు 4,075 మందికి ఏపీలో ఉపాధ్యాయులుగా పోస్టింగ్ ఇచ్చిన నేపథ్యాన తెలంగాణలో కూడా ఇవ్వాలని పలువురు అభ్యర్థులు కోరారు. సత్తుపల్లిలోని కళాభారతిలో ఆదివారం డీఎస్సీ క్వాలిఫైడ్ అభ్యర్థుల సమావేశం జరిగింది. ఈసమావేశంలో బొర్రా శ్రీనివాసరావు, చీకటి శ్రీనివాసరావు, జానీ మాట్లాడుతూ.. అభ్యర్థులకు ఉద్యోగాలు ఇవ్వడంపై ఏడాది క్రితం మంత్రివర్గ ఉపసంఘం నియమించినా ఫలితం లేదని తెలిపారు. రాష్ట్రంలో 1,500 మంది వరకు అభ్యర్థులు ఉండగా, కొందరికి వయోపరిమితి దాటిందని మరికొందరు చనిపోయారని చెప్పారు. ఆంధ్రప్రదేశ్ తరహాలో మినిమమ్ టైం స్కేల్ పద్ధతిలోనైనా పోస్టులు ఇవ్వాలని కోరారు. కోర్టుల సూచనలు ఉన్నా అధికారులు ప్రభుత్వాన్ని తప్పుదోవ పట్టించి తమకు అన్యాయం చేస్తున్నారని వాపోయారు. ఇంకా ఈ సమావేశంలో కోటారెడ్డి, ఎంఎస్ఎన్ చారి తదితరులు పాల్గొన్నారు.


ఉద్యోగాలు ఇవ్వాలని పోస్టర్లు ప్రదర్శిస్తున్న 1998 డీఎస్సీ అభ్యర్థులు

కాలిపోయిన పత్తికి బీమా వర్తించేలా చర్యలు


సమావేశంలో మాట్లాడుతున్న మార్కెట్ చైర్‌పర్సన్ శ్వేత

ఖమ్మంవ్యవసాయం: ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో శనివారం జరిగిన అగ్ని ప్రమాదంలో రూ.41లక్షల పైచిలుకు పత్తి కాలిపోగా, బాధిత వ్యాపారికి బీమా అందేలా చర్యలు తీసుకుంటామని మార్కెట్ చైర్‌పర్సన్ దోరేపల్లి శ్వేత తెలిపారు. ఖమ్మం మార్కెట్‌లో ఆదివారం ఆమె చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులతో సమావేశమై అగ్నిప్రమాదంలో నష్టంపై చర్చించారు. పత్తి కొనుగోళ్లు ఈ–నామ్ విధానంలో జరుగుతున్నందున శ్రీ శివ గణేష్ కృష్ణ ట్రేడర్స్ వ్యాపారి చిత్తూరి శ్రీనివాస్ నష్టపోయిన పత్తి బస్తాల వివరాలు నమోదైనందున పరిహారం ఇప్పించేలా చర్యలు తీసుకోవడంతో పాటు ఘటనపై దర్యాప్తు జరిపిస్తామని చైర్‌పర్సన్ తెలిపారు. ఎవరైనా ఉద్దేశపూర్వకంగా ఘటనకు పాల్పడి ఉంటే చట్టపరమైన చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. ఇకనుంచి మార్కెట్‌లో ఫైరింజన్ అందుబాటులో ఉండేలా చూస్తామని ఆమె తెలిపారు. మార్కెట్ వైస్ చైర్మన్ షేక్ అఫ్జల్, ఉన్నత శ్రేణి కార్యదర్శి రుద్రాక్షి మల్లేశం, డైరెక్టర్లు గుండ్ల ముత్తయ్య, మందా రామకృష్ణ, గ్రేడ్–2 కార్యదర్శి బి.బజార్, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చిన్ని కృష్ణారావు, మెంతెల శ్రీశైలంతో పాటు సోమా నర్సింహారావు, మన్నెం కృష్ణ, నల్లమల ఆనంద్, చెరుకూరి సంతోష్, ఎడ్లపల్లి సతీష్, ముత్యం ఉప్పల్‌రావు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలపై సమరానికి సన్నద్ధం


సమావేశంలో మాట్లాడుతున్న ఆజాద్

ఖమ్మంమయూరిసెంటర్: ప్రభుత్వ పాఠశాలల్లో కనీస సౌకర్యాలు కల్పించడంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నామాల ఆజాద్, రాష్ట్ర సహాయ కార్యదర్శి సంధ్య అన్నారు. ఖమ్మంలోని రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో ఆదివారం నిర్వహించిన ముఖ్య నాయకుల సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా సోమవారం నుంచి స్కూళ్లు ప్రారంభం కానున్నప్పటికీ పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్స్ చేరలేదన్నారు. అంతేకాక పాఠశాలల్లో తరగతి గదులు, టాయిలెట్ల కొరత, ఉపాధ్యాయ పోస్టుల భర్తీపై పట్టించుకోలేదని ఆరోపించారు. ఇవన్నీ పక్కన పెట్టి తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాలు నిర్వహించడం ఏమిటని ప్రశ్నించారు. మన ఊరు – మన బడి పథకానికి నిధుల కేటాయింపు సక్రమంగా జరగక ఆశించిన స్థాయిలో పాఠశాలల్లో సౌకర్యాలు సమకూరలేదని తెలిపారు. మరోపక్క ప్రైవేట్ విద్యాసంస్థలు తల్లిదండ్రుల నుంచి భారీగా ఫీజులు దండుకుంటున్నా.. ప్రభుత్వం, విద్యాశాఖ పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఈ సమావేశంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేష్, నాయకులు కిరణ్, దీపిక, నవీన్, వినయ్, శశి, కరుణ్, కార్తీక్, రాజేష్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

దేవాదాయ శాఖ మహిళా ఉద్యోగులకు పోటీలు


పోటీల్లో భాగంగా ముగ్గులు వేస్తున్న మహిళా ఉద్యోగులు

ఖమ్మంగాంధీచౌక్: తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా దేవాదాయ, ధర్మాదాయ శాఖ ఆధ్వర్యాన ఆదివారం మహిళా ఉద్యోగులకు ముగ్గులు, క్రీడా పోటీలు నిర్వహించారు. ఖమ్మంలోని శ్రీ గుంటు మల్లేశ్వర స్వామి దేవస్థానంలో జరిగిన ఈ పోటీలు జరిగాయి. అవతరణ వేడుకల్లో భాగంగా మంగళవారం మహిళా సంక్షేమ దినోత్సవాన్ని నిర్వహించనున్న దృష్ట్యా పోటీలు ఏర్పాటుచేశామని దేవాదాయ, ధర్మాదాయ శాఖ ఉమ్మడి జిల్లా సహాయ కమిషనర్ ఏ.సులోచన తెలిపారు. పోటీల్లో విజేతులకు ఈనెల 21వ తేదీన జరిగే ఆధ్యాత్మిక దినోత్సవంలో బహుమతులు అందజేస్తామని చెప్పారు. శాఖ ఇన్‌స్పెక్టర్ ఆర్.సమత, అర్చక, ఉద్యోగులు దాములూరి వీరభద్రరావు, చుండూరు రామకోటేశ్వరరావు, కృష్ణమాచార్యులు, రామశర్మ, ఎస్‌వీడీ.ప్రసాద్, బి.మురళి, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.